సాక్షి కాకినాడ

శనివారం । 1 । ఏప్రిల్ । 2023

బంగారు, వెండి పుష్పాలతో పూజలు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.






రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దేవరాజు సత్యనారాయణమూర్తి (గుంటూరు) శుక్రవారం రూ.లక్ష విరాళం అందించారు.

డెల్టాలకు 6,635 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 6,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,960, మధ్య డెల్టాకు 1,275, పశ్చిమ డెల్టాకు 3,400 క్యూసెక్కులు వదలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.65 అడుగులకు చేరింది.





న్యూస్‌రీల్

తలుపులమ్మ తల్లికి రూ.2.71 కోట్ల ఆదాయం

తుని రూరల్: లోవ దేవస్థానంలో వేంచేసిన తలుపులమ్మ అమ్మవారికి హుండీల ఆదాయం గణనీయంగా పెరిగిందని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో దేవదాయ శాఖ తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబు నాయుడు, చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తల సమక్షంలో దేవస్థానం హుండీలను శుక్రవారం తెరిచి, నగదు లెక్కించారు. చిల్లర రూ.23,622, నగదు రూ.7,46,830 కలిపి మొత్తం రూ.7,70,452 వచ్చాయని ఈఓ తెలిపారు. దీంతో కలిపి 2022–23 ఆర్థిక సంవత్సరంలో దేవస్థానానికి హుండీల ద్వారా రూ.2,71,61,779 ఆదాయం సమకూరిందని చెప్పారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.2,13,92,375 వచ్చిందన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి రూ.57,69,404 అదనంగా లభించాయని ఈఓ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ స్పందనకు 52 అర్జీలు

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ స్పందన హాలులో శుక్రవారం ప్రత్యేక స్పందన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, జేసీ సీతాలక్ష్మి, ఎస్‌వీడీ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీవీఎస్ సుశీలలు 52 అర్జీలు స్వీకరించారు. వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, రెవెన్యూ సేవలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పెన్షన్ తదితర అంశాలపై అర్జీలు వచ్చాయి.

గడువులోగా రీ సర్వే పూర్తి చేయాలి

గోకవరం: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో నిర్వహిస్తున్న రీ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణితో కలిసి రీ సర్వేపై గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రీ సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. అంతకు ముందు మండలంలోని కృష్ణునిపాలెంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గోకవరంలో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో గుర్తించిన భూములను పరిశీలించారు. ఇళ్ల స్థలాల కోసం సుమారు 20 ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని జేసీకి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, సర్వేయర్లు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలాత్రిపుర సుందరి కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక సూర్యారావుపేట బీచ్‌లోని బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారి వసంత నవరాత్ర ఉత్సవాలు శనివారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. శనివారం రాత్రి 9 గంటలకు బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ నెల 3న నవస్నపన, 4వ తేదీ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి, అమ్మవార్ల రథోత్సవం, రాత్రి ఆలయ కోనేరులో తెప్పోత్సవం జరుగుతాయని వివరించారు. 5న పుష్పయాగం, 6న శ్రీపుష్పోత్సవం జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

3న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యాన సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, బజాజ్ క్యాపిటల్, సోలో ఎనర్జీస్, పనాస్ ఎక్స్‌ప్రెస్, ఎస్‌బీఐ లైఫ్ (బీసీఏపీఓ), డెక్కన్ కెమికల్స్, ఇండిగో ఎయిర్ లైన్స్, హుండాయ్ మొబిస్, సియోన్ అండ్ సలోరా యాక్టివ్ ఫార్మా సంస్థల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నామని వివరించారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 40 ఏళ్ల లోపు అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ వేతనం, ఆయా ఉద్యోగాలను బట్టి భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

టెన్షన్ వద్దు

- సరిగ్గా రాస్తే మార్కులు 'పది'లం
- దస్తూరి బాగుంటే మేలు
- సమయపాలనా అవసరమే..
- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచనలు

రాయవరం: పదో తరగతి పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 77,183 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కాలం సమీపిస్తుండటంతో విద్యార్థుల్లో ఇప్పటికే 'టెన్షన్' మొదలైంది. తొలిసారి పబ్లిక్ పరీక్షలు అనగానే తెలియని ఆందోళన. తెలిసిన సమాధానాలే అయినా వాటిని పేపరుపై ఎలా రాయాలో తెలియక కొందరు సతమతమవుతారు. తరగతి గదిలో ఠకీమని జవాబు చెప్పే కొందరు విద్యార్థులు మార్కుల సాధనలో మాత్రం వెనుకబడుతూంటారు. వచ్చిన సమాధానాలను సరిగ్గా ప్రజెంట్ చేయలేకపోవడమే దీనికి కారణం. ఆ చిన్న అవరోధాన్ని అధిగమిస్తే విజయం వారి పాదాక్రాంతమవుతుంది. పరీక్షల్లో సాధారణంగా విద్యార్థులు చేసే చిన్నచిన్న పొరపాట్లు, వాటిని సరిదిద్దుకోవలసిన తీరు, జవాబులు రాయడంలో మెళకువలు తెలుసుకుందాం.

సహజంగా చేసే పొరపాట్లు

- కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. గజిబిజిగా, దగ్గర దగ్గరగా ఉండటంతో చూడగానే జవాబుపత్రం ఆకట్టుకోదు.
- ఒక పాయింట్ దగ్గర మొదలైన రాత ఆ లైను చివరికి వెళ్లేసరికి పైకో కిందకో పోతుంది. దాంతో ఆ పేజీల్లో లైన్లన్నీ గజిబిజిగా మారతాయి. లైన్లు సమాంతరంగా ఉండేలా చూడాలి.
- ప్రశ్న సంఖ్యలు, జవాబుల్లో ముఖ్యమైన పాయింట్లను వచ్చే సంఖ్యలు మార్జిన్‌లో ఒకదాని కింద మరొకటి వేయవద్దు.
- లైను చివర పదాలు రాస్తూ చివరికి వెళ్లగానే అక్కడ సగం పదం రాసి.. మరో సగాన్ని కింద లైనులో రాస్తుంటారు. దీంతో దిద్దే వారికి ఆ పూర్తి పదం ఏమిటో వెంటనే అర్థం కాదు. సాధ్యమైనంత వరకూ పదాలను ఒక లైనులో వచ్చేలా రాయాలి.



పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లి స్కూల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

- చాలా మంది విద్యార్థులు బాగా ఒత్తి పట్టి రాస్తుంటారు. కలాన్ని వేళ్లతో బిగువుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబు పత్రాలు గజిబిజిగా తయారవుతాయి. పైగా విద్యార్థులకు కూడా రాయడం మొదలు పెట్టిన కొద్దిసేపటికే వేళ్లు నొప్పి పెడతాయి.
- చాలా మంది విద్యార్థులు అంకెలను సరిగా రాయరు. '2' అంకెను ఇంగ్లిష్ 'జెడ్' తరహాలో, '5'ను 'ఎస్'లా '0'ను 6లా రాస్తుంటారు. ఫలితంగా రాసేవారికి మార్కులు తగ్గిపోతాయి.
- చాలా మంది విద్యార్థులు ఇంగ్లిష్ 'ఐ'పై చుక్క 'జె' అక్షరంపై గీత వేయరు. తెలుగులో ఙ, మ, య, సగాల రాయరు.
- పరీక్ష పత్రంలో ఏదైనా తప్పులు రాస్తే వాటిని పెన్సిల్ లేదా పెన్నుతో బాగా రుద్దుతారు. దీంతో పేపరంతా నల్లగా మారుతుంది. స్కెచ్ పెన్సిళ్లు, పలు రంగుల రీఫిల్స్‌ను అడ్డదిడ్డంగా ఉపయోగిస్తారు. ఇది మంచిది కాదు. అవసరమైన చోట ఉపయోగిస్తేనే అందంగా ఉంటుందని గుర్తించాలి.
- సైన్స్‌లో బొమ్మలు గీస్తే ఆ చిత్రంలోని భాగాల్ని గుర్తించడంలో ఒక క్రమ పద్ధతి పాటించాలి.

మూడు గంటల్లో..

ఏదైనా మొత్తం చదివింది ఒక ఎత్తయితే పరీక్షల్లో ఎలా ప్రజెంట్ చేశామనేది చాలా కీలకం. ఏడాదంతా చదివిన విషయాలను మూడు గంటల్లో పరీక్ష పత్రంపై ఎలా పెట్టాలో ఒడుపు తెలుసుకోవాలి. అన్ని సమాధానాలూ తెలిసినా సమగ్రంగా రాయలేకపోతారు. ఇందుకు ఈ నాలుగు అంశాలను గుర్తించాలి.

- జవాబులు సూటిగా రాయాలి.
- సమాధానాలు బేరీజు తెలుసని గుర్తించాలి.
- మనం రాసే తీరు పేపరు దిద్దేవారిని ఇబ్బంది పెట్టేలా ఉండరాదు.
- వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి.
- చేతిరాత గుండ్రంగా, అర్థమయ్యేలా ఉండాలి.

ఇలా రాస్తే మంచిది

- ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్నాకే జవాబులు రాయాలి.
- సమాధాన పత్రంలో పేజీకి 15–16 లైన్లు ఉండాలి. పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి.
- మొదటి పదాలతో ఎంత వరకూ పేజీ చివరి వరకూ అదే దస్తూరి కొనసాగించాలి. వాక్యాలు చక్కగా ఉండేలా చూసుకోవాలి.

అక్షరం బాగుంటే..

విద్యార్థి చేతిరాతను బట్టి సంబంధిత విషయంపై అతడి అవగాహనా స్థాయిని చెప్పవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైన వారైనా పరీక్షపత్రాలు దిద్దేవారికి తెలియదు. వారు రాసే తీరు, అక్షరాల కూర్పును బట్టి వారి జ్ఞానాన్ని అంచనా వేస్తారు. ఈ విషయంలో చేతిరాతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కళ్లకు ఇంపుగా కనిపించే అక్షరాలు.. అందమైన దస్తూరి చూసే వారిని ఇట్టే ఆకట్టుకుంటాయి. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారి మనసుకు హత్తుకుని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది. పరీక్షల్లో విజేతగా నిలుపుతుంది.

ఆయా జిల్లాల్లో పదో తరగతి విద్యార్థుల వివరాలు

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
కాకినాడ	15,182	14,806	29,988
తూర్పు గోదావరి	13,563	12,665	26,228
కోనసీమ	10,868	10,099	20,967
మొత్తం	39,613	37,570	77,183

మూల్యాంకనంపై ప్రభావం



అందమైన దస్తూరి మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది కష్టపడి చదువుతారు కానీ బాగా రాయక పోవడంతో అనుకున్న మార్కులు సాధించలేక పోతున్నారు. మార్కుల సాధనలో దస్తూరి కూడా ఒక ప్రధాన అంశం. అలాగే చదివిన విషయాన్ని పేపరుపై ప్రజెంట్ చేయడం కూడా మరో ప్రధాన అంశంగా చెప్పవచ్చు.

– కోలా సత్యనారాయణ, జీహెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, ప్రభాకర్‌నగర్, సీతానగరం మండలం

కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి



సమాధానాలు రాసే సమయంలో తప్పులు, కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. అలాగని దస్తూరి సరిగ్గా లేని వారు అందోళన పడాల్సిన పనిలేదు. సమాధానాలు అర్థమయ్యేలా చూసుకోవాలి. ఉన్నంతలో మెరుగ్గా రాసే ప్రయత్నం చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– మట్ట శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, రాయవరం

- తెలుగు, ఆంగ్లం, హిందీలోని లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి. అక్షర దోషాలు దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి.
- గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గిస్తారు. ఇచ్చిన సమస్యను అర్థం చేసుకున్న తర్వాతే రాయడం ప్రారంభించాలి.
- గ్రాఫ్ చక్కగా గీయాలి.
- సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి, సులభంగా ఉన్నవాటిని ఆకర్షణీయంగా గీయాలి.
- సాంఘిక శాస్త్రం సమాధానాలను పాయింట్లవారీగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా గుర్తించాలి.
- సమాధానాలకు శీర్షికలు, ఉపశీర్షికల కింద అండర్‌లైన్ చేయాలి.
- మంచి పెన్నులు ఉపయోగించాలి. బిట్లు రాసేటప్పుడు కొట్టివేతలు రాకుండా చూసుకోవాలి.
- అక్షరాలు గుండ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.

మహిళల ఎదుగుదలకు ప్రభుత్వం కృషి

- ఎంపీ వంగా గీత
- రూ.41.52 లక్షలతో జిల్లాలో 3వ మహిళా మార్ట్ ప్రారంభం
- పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: మహిళలు స్వయంశక్తితో ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సంఘాల ఆధ్వర్యాన కిర్లంపూడిలో కొత్తగా నిర్మించిన చేయూత మహిళా మార్ట్‌ను ఆమె, కలెక్టర్ కృతికా శుక్లా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ, మహిళలు వ్యాపార రంగంలో రాణించాలన్న లక్ష్యంతో ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వం మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ద్వారా మహిళా రుణాలను మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తున్న ఏకైక సీఎం జగన్ అని అన్నారు.

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరో పది మందికి ఉపాధి కల్పించేలా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి చెందాలని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కాకినాడ జిల్లాలోనే నాలుగు మార్ట్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. కిర్లంపూడిలో మహిళా స్వయం సహాయక సంఘాలు అధికంగా ఉండటంతో రూ.41.52 లక్షల వ్యయంతో మూడో చేయూత మహిళా మార్ట్ ప్రారంభించామని చెప్పారు. పరిసర గ్రామాల్లో ఎక్కడా లేని విధంగా తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు విక్రయించేలా ఈ మార్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు మార్ట్‌లు అధిక లాభాలు ఆర్జిస్తున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని, మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ మార్ట్‌లో నిత్యావసర వస్తువులు కొని, దీని ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని కలెక్టర్ కోరారు.

ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ, మెట్ట ప్రాంతంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇలాంటి మార్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మండలంలో మహిళా సంఘాలు ఎక్కువగా ఉన్నందు వల్ల భవిష్యత్తులో మరింత పెద్ద మార్ట్ నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, తహసీల్దార్ కేవీ మాధవరావు, ఎంపీడీఓ బి.సతీష్ బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దోమాల గంగాధర్, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, వైస్ ఎంపీపీ బొద్దేడ గణపతి, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.



మార్ట్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా. చిత్రంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితరులు

మంచి పనులతో కీర్తిప్రతిష్టలు

తుని: ప్రజలకు చేసిన మంచి పనులే కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో రోటరీ క్లబ్ హెల్త్ 65 ఏళ్ల ఉత్సవాలు తుని శాఖ అధ్యక్షుడు ఎన్.సతీష్ ఆధ్వర్యాన శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా తుని ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు స్థానికంగా రోటరీ క్లబ్‌ను స్థాపించిన డాక్టర్ చల్లా సుబ్బారాయుడు, ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ విగ్రహాలను మంత్రి రాజా ఆవిష్కరించారు. విద్యార్థులకు పెద్ద బాలశిక్ష పుస్తకాలు పంపిణీ చేశారు. రోటరీ హాలులో జరిగిన సభలో రాజా మాట్లాడుతూ, డాక్టర్ చల్లా సుబ్బారాయుడు ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రజల నుంచి ఒక రూపాయి కూడా తీసుకోకుండా వేలాది మందికి వైద్యం అందించడంతో పాటు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు, రోటరీ క్లబ్ నిర్మాణానికు సొంత సొమ్మును ఖర్చు చేసిన మహనీయుడు సుబ్బారాయుడు విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఇటువంటి సేవలు చేయడానికి యువతను ప్రభుత్వ వర్గం అవార్డు ఇవ్వాలని కోరుకుంటున్నానని రాజా అన్నారు. రోటరీ క్లబ్ తరఫున మంత్రి రాజాను సత్కరించారు. డాక్టర్ అర్జీ కాన్యూర్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయలు, దక్కా తాతబాబు, రోటరీ క్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ రెడ్డి నాగభూషణం, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాబు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ వేడుకల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

మత్తు విభాగానికి రూ.76 లక్షల ఉపకరణాలు

- కాకినాడ సీపోర్ట్స్ వితరణ
- జీజీహెచ్‌కు అందజేసిన సీఎండీ కేవీ రావు

కాకినాడ క్రైం: జీజీహెచ్ అనస్థీషియా విభాగానికి కాకినాడ సీపోర్ట్స్ సీఎండీ కేవీ రావు రూ.76 లక్షల విలువైన వైద్య ఉపకరణాలు సమకూర్చారు. అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యాన జీజీహెచ్ కమ్యూనిటీ హాలులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పరికరాలను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు అనస్థీషియా యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేవీ రావు దాతృత్వాన్ని కొనియాడారు. ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులు ఎంతో మంది ప్రాణ రక్షణకు దోహదపడతాయని, అటువంటి చోట దేవుడు దానం చేయడం ప్రాణదానంతో సమానమవుతుందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తండ్రి భాస్కరరెడ్డితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన ఆదిని రాయడం సినిమాను కాకినాడ దేవీ థియేటర్‌లో ఆయనతో కలిసి చూశానన్నారు. సుందర కాకినాడ నగరం సినిమా షూటింగ్‌లకు అనువైనదన్నారు. స్థానిక నేతలు, అధికారులు మరిన్ని లొకేషన్లను ఆవిష్కరిస్తే, సినీ పరిశ్రమకు తోడ్పాటునిస్తారని కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ, సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విష్ణువర్ధన్ వినతి మేరకు, కేఎస్‌పీఎల్ సీఈఓ మెర్ల మురళీధర్ అనుమతులు లేకుండానే కేవీ రావు అనస్థీషియా విభాగం అవసరాలను విన్నవించానన్నారు. ఆయన తక్షణమే పరికరాలు అందించేందుకు అంగీకరించారన్నారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, మత్తు విభాగం అన్ని శస్త్రచికిత్సలకు ఎంతో కీలకమైనదని, వితరణ చేసిన పరికరాలు ఎంతో ప్రయోజనకరమని అన్నారు.

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సుమారు ఆరు జిల్లాల రోగులు జీజీహెచ్‌కు నిత్యం వస్తూంటారన్నారు. కేవీ రావు ఇప్పటికే జీజీహెచ్‌కు రూ.2.63 కోట్ల విలువైన పరికరాలు అందించారని, తాజా పరికరాలు అందజేశారని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, హెచ్‌ఓడీ డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, అనస్థీషియా వర్క్ స్టేషన్లు 5, మల్టీ పారా మానిటర్లు 3, ఇంటిమేషన్ బ్రాంకోస్కోప్ ఫైబర్ ఆప్టిక్స్ 1, మూడు వెంటిలేటర్లు అందజేశారని వివరించారు. తలకు గాయాలైన వారికి జీజీహెచ్‌లో కేవీ రావు సహకారంతో అందజేసిన కీలక పరికరాలతో 2014 నుంచి అనేక మందికి శస్త్రచికిత్సలు చేసి ప్రాణాలు నిలిపామని చెప్పారు. ఈ సందర్భంగా కేవీ రావు, కె.రాఘవేంద్రరావులను జీజీహెచ్ యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ హరి విజయకుమార్, డాక్టర్ ఎస్.వెంకటరెడ్డి, సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ పుప్పరాజు, డీసీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ అనిత, ఏపీఎంజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



అనస్థీషియా యంత్రాన్ని ప్రారంభిస్తున్న కె.రాఘవేంద్రరావు. చిత్రంలో కాకినాడ సీపోర్ట్స్ సీఎండీ కేవీ రావు, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎంపీ గీత తదితరులు

ఉపాధి కాస్తంత పెంపు

- పెరిగిన కూలి
- రూ.15 పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు
- నేటి నుంచి అమలు
- జిల్లాలో 4.55 లక్షల మందికి లబ్ధి

కాకినాడ సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం పెరగనుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం పెరిగిన వేతనాలను శనివారం నుంచి కూలీలకు అందజేయనున్నారు. ఇప్పటి వరకూ ఒక్కో కూలీకి రూ.257 చెల్లిస్తుండగా ఇక నుంచి రూ.272 అందుతుంది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 4.55 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. కాగా, ఏటా కూలీలకు అందించే వేతన భత్యంపై మాత్రం కేంద్రం ఎటువంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం.

లక్ష్యాలను నిర్దేశిస్తున్న కేంద్రం

ఉపాధి హామీ పథకం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్న కేంద్రం.. పని దినాల లక్ష్యాల కేటాయింపులను కూడా పర్యవేక్షిస్తోంది. కూలీల సంఖ్య ఆధారంగా గ్రామ, బ్లాక్ (మండలం), జిల్లాకు పని దినాల లక్ష్యాలను నిర్దేశిస్తోంది. గతంలో కేంద్రం నుంచి వచ్చే పని దినాల లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొంత మేర పెంచుతూ జిల్లాలకు ప్రత్యేక లక్ష్యాలు ఇచ్చేది. కానీ కొత్త సాఫ్ట్‌వేర్ రావడంతో కేంద్రం సూచనలనే అమలు చేయాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయంలో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంటోంది. ఈ ఏడాది ఉపాధి పనులకు జిల్లావ్యాప్తంగా 3.22 లక్షల పని దినాలు వినియోగించుకున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఉపాధి పనుల వివరాలు

జిల్లాలో మొత్తం బ్లాక్‌లు:	20
మొత్తం గ్రామ పంచాయతీలు:	385
జాబ్‌కార్డులు:	2,72,000
కూలీలు:	4,55,000
యాక్టివ్ జాబ్ కార్డులు :	2,06,000
పనులకు వెళ్లే కూలీలు :	3,14,000
ఇప్పటి వరకూ ఖర్చు చేసిన నిధులు:	రూ.234.11 కోట్లు
చెల్లించిన వేతనాలు :	రూ.137.73 కోట్లు
మెటీరియల్ ఖర్చు :	రూ.96.38 కోట్లు

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు వేతనం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన వేతనం నేటి నుంచి అమలులోకి రానున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. జాబ్‌కార్డులు కలిగిన కూలీలు వేసవిలో పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– అడపా వెంకటలక్ష్మి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

ఆస్కార్ అవార్డు దేశానికే గర్వకారణం



సినీ దర్శకులు రాఘవేంద్రరావును సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు అస్కార్ అవార్డు రావడం తెలుగుజాతికే కాకుండా, దేశానికి గర్వకారణమని ప్రముఖ దర్శకులు కె.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో యువ కళాకారుల కెరియర్ వర్క్‌కు ఉపయోగపడే విధంగా కేఆర్‌ఆర్ వర్క్స్ యూ ట్యూబ్ చానల్ ప్రారంభిస్తున్నానని చెప్పారు. నేటి కాలంలో యూట్యూబ్, సోషల్ మీడియా వేదికగా పలువురు తమ నటనా ప్రతిభను తెలియజేస్తున్నారన్నారు. ప్రతిభ ఉంటే ఏరంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రగతి కళాశాల ప్రెస్‌క్లబ్ విద్యార్థులు దర్శకులు రాఘవేంద్రరావు బయోగ్రఫీ, ఆయన చిత్రీకరించిన సినిమాలపై రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం అకర్షణగా నిలిచింది. ప్రగతి కళాశాల చైర్మన్ పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తమకు ఇష్టం ఉన్న రంగంపై ఆసక్తి పెంచుకుని అభివృద్ధి చెందాలని, ఇదే కళాశాలలో చదివిన విద్యార్థులు పలు రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు.

పునరావాస కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో విజిలెన్స్ ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం యూనిట్ పరిధిలోని మహిళలు, బాలికలు, బాలురు, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, మత్తు పదార్థాలకు బానిసలు, బిచ్చగాళ్లు, ట్రాఫికింగ్ వ్యక్తులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని భారతి వికలాంగుల సేవాసమితి సొసైటీ, భాస్కర్ సంక్షేమ సంఘంలో సౌకర్యాలను తనిఖీ చేశారు. కాకినాడ అశోకనగర్‌లో శిశుగృహను తనిఖీ చేశారు. అమలాపురం మండలం ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రాన్ని పరిశీలించారు. వీటిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించబోతున్నట్లు ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ పి.ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తహసీల్దార్ విజయకుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం పాల్గొన్నారు.

వెంకన్న పెండ్లికొడుకాయెనె

- నేడు వాడపల్లి వెంకన్న రథోత్సవం, కల్యాణం
- తీర్థం, ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



సిద్ధమైన స్వామివారి కల్యాణ వేదిక



సమరయోధుల స్మారక చిహ్నం



ఉత్సవానికి సిద్ధమైన రథం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. వేకువ జామున భరద్వాజ గోత్ర పాలకుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. భార్గవశ గోత్ర నామాలతో శ్రీదేవిని, కాశ్యప గోత్రీకురాలు భూదేవిని పెండ్లి కుమార్తెలుగా అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6–15 గంటలకు స్వామి వారి ధ్వజారోహణ, అంకురార్పణ, నిత్య బలిహరణ అనంతరం స్వామి వారి దర్శనాలకు అనుమతి ఇచ్చారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చక బృందం ఘనంగా నిర్వహించారు.

నేడు రథోత్సవం, కల్యాణం

చైత్రశుద్ధ ఏకాదశి శనివారం రాత్రి 7.01 గంటలకు స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పిస్తారు.

దేశభక్తికి గుర్తుగా స్మారక చిహ్నం

1931లో స్వాతంత్ర్య ఉద్యమంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న కల్యాణ ఉత్సవాల్లో దేశభక్తి కట్టలు తెంచుకుంది. గాంధీజీ పిలుపు మేరకు పరిసర ప్రాంతాలకు చెందిన నాయకులు రథోత్సవ కార్యక్రమంలో దేశ సమైక్యతను చాటే స్వరాజ్య జెండాను, గాంధీజీ చిత్ర పటాన్ని స్వామివారి రథంపై ఉంచేందుకు ప్రయత్నించారు. దీంతో బ్రిటీష్ సైన్యం జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమరులు కాగా మరో 16మందిపై కేసులు నమోదు చేశారు. వారి దేశభక్తికి గుర్తుగా ఆలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నన్ని ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానుండడంతో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మెర్లపాలెం నుంచి వాడపల్లి వరకు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు, పాలు, పులిహోర, అన్నదానం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

వ్యాపారుల సందడి

తీర్థ మహోత్సవానికి వ్యాపార సముదాయాలు సిద్ధమయ్యాయి. వారం రోజులపాటు నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తూ ఉంటారు. రంగుల రాట్నం, జెయింట్‌వీల్, వంటివి నిర్వాహకులు సిద్ధం చేశారు. భక్తుల కోసం ఆలయంలో లడ్డూలను తయారు చేస్తున్నారు.

విద్యుత్ కాంతులతో వెంకన్న ఆలయం

ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ వేదిక, పచ్చని పందిర్లు, విద్యుత్‌కాంతుల మధ్య స్వామి వారి ఆలయం కాంతులీనుతోంది. మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ఆలయం కల్యాణోత్సవానికి ముస్తాబైంది.

విస్తృత పోలీస్ బందోబస్తు

రాష్ట్ర నలుమూలల నుంచి యాత్రికులు స్వామి వారి కల్యాణోత్సవాలకు తరలిరానున్న దృష్ట్యా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, సుమారు 200 మంది పోలీస్, హోంగార్డులు ఉత్సవ ఏర్పాట్లుకు తరలివచ్చారు.

'బార్' ఎన్నికలకు తొలిరోజు 10 నామినేషన్లు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు తొలిరోజు శుక్రవారం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. 2023–24 సంవత్సరానికి బార్ నూతన కార్యవర్గానికి ఏప్రిల్ 17వ తేదీన ఎన్నిక జరగనుంది. తొలిరోజు ఉపాధ్యక్షుడిగా కె.వి భద్రరావు, జనరల్ సెక్రటరీలుగా చక్కా ఎస్.వి.ఎస్.శ్రీనివాస్, బంధకవి రామలింగశర్మ నామినేషన్లు దాఖలు చేశారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా చాగంటి మురళీధర్, లైబ్రరీ సెక్రటరీగా షేక్ అమీర్ జాని, కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్ షా, మహిళా ప్రతినిధిగా జి.దివ్య శ్రీ విద్య , జూనియర్ కమిటీ మెంబర్లుగా కె.ఏడుకొండలు, మొహిద్దీన్, వి.బిందుశ్రీ నామినేషన్లు దాఖలు చేశారని, ఈ నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 3వ తేదీ వరకు కొనసాగుతుందని అడ్‌హాక్ కమిటీ సభ్యులు మహ్మద్ జవహర్ ఆలీ, ఎ.వెంకటేష్, టీపీఆర్ చంద్రశేఖర్, కేఆర్ వీ.భద్రరాజు, ఎస్.దిలీప్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

తుని: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..తుని రైల్వే పోలీసుస్టేషన్ పరిధి గొల్లప్రోలు–రావికంపాడు రైల్వే స్టేషన్ల మధ్య పిఠాపురం నుంచి తుని వైపు వస్తున్న రైలుబండి నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి జారిపడి మృతి చెందాడు. మృతుడు చిలుకాకపచ్చ జర్కిన్, సిమెంట్ కలర్ ఫుల్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు వివరించారు. వివరాలు తెలిసినవారు 94906 19020, 94948 87786 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అటవీ సంరక్షణలో ప్రజా సహకారం



అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మధుసూదనరెడ్డి

రాజానగరం: అటవీ సంరక్షణలో ప్రజల సహాయ, సహకారాలు ఎంతో కీలకమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అటవీ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి వై.మధుసూదనరెడ్డి సూచించారు. దివాన్‌చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీలో ఆరు మాసాలు శిక్షణ పూర్తి చేసుకున్న 6వ బ్యాచ్ ఫారెస్టు బీట్ అధికారులు, 9వ బ్యాచ్ ఫారెస్టు సెక్షన్ అధికారులకు శుక్రవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో సర్టిఫికెట్లు అందజేశారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ అడవిని తమ సముదాయక ఆస్తిగా ప్రజలు భావించినప్పుడు వారే దానిని రక్షించుకుంటారన్నారు. అటువంటి భావన ప్రజలలో కల్పించడం కోసం కృషి చేయడం పైనే విధి నిర్వహణలో విజయం ఆధారపడి ఉంటుందన్నారు. నగర వనాల ఏర్పాటు, ఏకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణ, అడవులలోకి పబ్లిక్‌ని అనుమతించడం వంటి చర్యలు ప్రజలను అటవీ సంరక్షణలో భాగస్వాముల్ని చేస్తాయన్నారు. అటవీ ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేయడం కంటే అవి రాకుండా శ్రద్ధ తీసుకోవడమే గొప్ప విషయమన్నారు. కోరంగి అభయారణ్యంలో ప్లాస్టిక్ నివారణ చర్యలు విజయవంతమైన విషయాన్ని ప్రస్తావిస్తూ ప్లాస్టిక్ సీసాలను అనుమతించాలంటే కాషన్ డిపాజిట్ తీసుకుంటున్నారన్నారు. వాటిని తిరిగి కౌంటర్లలో అప్పగించిన తరువాతనే డిపాజిట్‌ని వెనక్కి ఇస్తున్నారన్నారు. ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ పీఏవీ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ అకాడమీలో మౌలిక సదుపాయాలకు ప్రణాళికను తయారు చేశామన్నారు. 26 మంది ఎఫ్ఎస్‌ఓలు, 29 ఎఫ్‌బీఓలు పరీక్షలకు హాజరుకాగా, వారిలో అంతా ఉత్తీర్ణులయ్యారన్నారు. రాజమహేంద్రవరం ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఎస్. శ్రీశరవణన్, ఎఫ్ఎస్‌ఓ, ఎఫ్‌బీఓ కోర్సు డైరెక్టర్లు టి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్‌వీ శివరామప్రసాద్, ఏసీఎఫ్‌లు ఏవీ రమణమూర్తి, వి.శ్రీహరిగోపాల్, టి.చక్రపాణి, ఎఫ్‌ఆర్‌ఓ అనూష, జె.దామోదర్ పాల్గొన్నారు.

నాసిరకం మందుల విక్రేతకు జైలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నాసిరకం మందులు అమ్మిన కేసులో ఒక వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. విజయవాడకు చెందిన హానెస్ట్ ఫార్ములేషన్స్, సత్యనారాయణ ఎంటర్‌ప్రైజెస్ యజమాని ఏవీఆర్ఎస్.సత్యనారాయణ నాసిరకం మందులు తయారుచేసి అమ్ముతున్నాడు. విషయం తెలిసిన అప్పటి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.చంద్రరావు 2016లో ఆ ప్రాంతంలో దాడి చేసి నాసిరకం మందులను పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో వాదనలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరత్నం నిర్వహించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు నాగమణి ఆధ్వర్యంలో ప్రస్తుతం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ పలు ఆధారాలను కోర్టుకు అందజేశారు.

టెన్త్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఈతకు వెళ్లిన ఐదుగురు విద్యార్థుల్లో సాయిదుర్గ మృతి
- తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన
- సమగ్ర దర్యాప్తునకు అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమణ



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



ఈతకు వెళ్లి మృతి చెందిన సాయిదుర్గ

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో పదో తరగతి విద్యార్థి ఈతకు వెళ్లి కోనేరులో అనుమానాస్పదంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు మృతదేహంతో పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు, పెదపూడి ఎస్సై పి.వాసు, డీఈఓ అన్నపూర్ణ, పాఠశాల హెచ్‌ఎం.కె.శ్రీనివాసు, తదితరులు ఆందోళనకారులతో మాట్లాడారు. దీనిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమింపజేశారు. సీఐ శ్రీనివాసు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మామిడాడ గ్రామానికి చెందిన పేలూరి వెంకన్న, దుర్గ దంపతులకు రెండో సంతానం సాయిదుర్గ(16). సాయిదుర్గ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ప్రతి రోజు మాదిరిగా సాయిదుర్గ పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులు గ్రూప్ ఫొటో తీయించుకున్న అనంతరం సాయిదుర్గతోపాటు జి.సూర్యతేజ, కె.అనిల్‌కుమార్, కె.వంశీ, అఖిల్ ఆదిత్య ఫొటో తీసుకున్నారు. అనంతరం సాయిదుర్గ ఇంటి వద్ద స్కూల్ బ్యాగ్‌లను పెట్టి కోనేరులో స్నానానికి వెళ్లారు. అక్కడ అఖిల్‌ఆదిత్య, సాయిదుర్గ ఇద్దరు కోనేరులో స్నానానికి దిగారు. మిగిలిన ముగ్గురు మృతుని ఇంటికి వచ్చి బ్యాగ్‌లు తీసుకుని వెళ్లిపోయారు. కొంతసేపటికి కోనేరులో సాయిదుర్గ మునిగిపోయాడంటూ స్థానికులు, అఖిల్ ఆదిత్య సాయిదుర్గను గట్టుపైకి తీసుకొచ్చారు. వెంటనే విద్యార్థులు ఈ విషయం ఉపాధ్యాయులకు తెలియజేసి స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఈ సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధుమిత్రులు తన కొడుకుని తోటి విద్యార్థులు చంపేశారంటూ పాఠశాల వద్ద మెయిన్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పాఠశాల నుంచి ఎందుకు బయటకు పంపించారంటూ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. దుర్ఘటనకు మీరే బాధ్యులని ఆరోపించారు. ఆందోళనతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వివరాలు నమోదు చేశారు. తండ్రి వెంకన్న ఫిర్యాదుపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు. మృతుని తండ్రి, తల్లి, అన్నయ్య ఫణిదుర్గ చేపల వ్యాపారం చేస్తుంటారు.

చిన్నోడినైనా చదివించి ఉద్యోగం చేయిద్దామనుకున్నాం

పెద్దోడు పదో తరగతి చదివి చేపల వ్యాపారం చేస్తూ తోడుగా ఉన్నాడు. చిన్నోడినైనా చదివించి పెద్ద ఉద్యో గం చేయిద్దామని అనుకున్నామని, మృత్యువు ఈత రూపంలో తీసుకుపోయిందని తల్లి దుర్గ, తండ్రి వెంకన్న రోదిస్తున్న తీరు అందర్నీ కంటతడి పెట్టించింది. మూడ్రోజుల్లో జరుగనున్న పదో తరగతి పరీక్షలు బాగా రాస్తానంటూ చెప్పి తమకు అందనంత దూరానికి వెళ్లిపోయాడు అంటూ వారు కంటతడి పెట్టారు.

వివాహిత ఆత్మహత్య

తుని రూరల్: మండలంలోని రాజుపేట గ్రామంలో వివాహిత గింజాల లోవతల్లి (20) ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. సంవత్సరం వయసు గల కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మనస్తాపం చెందిన లోవతల్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందన్నారు. రెవెన్యూ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించినట్టు తెలిపారు. భర్త కామరాజు మానసిక స్థితి బాగోలేదన్నారు. మృతురాలి సోదరి ఆవాల రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మృదంగ విద్వాంసుడు నాగేశ్వరరావు మృతి

- నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



నాగేశ్వరావు (ఫైల్)

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు వక్కలగడ్డ నాగేశ్వరరావు (88) శుక్రవారం మృతిచెందారు. దీర్ఘకాలంగా ఆయన కపిలేశ్వరపురంలోని శ్రీ సర్వారాయ హరికథా పాఠశాలలో మృదంగ ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో హరికథా ప్రదర్శనల్లో మృదంగ సహకారమందించి మంచి గుర్తింపు సాధించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ వంటి ప్రముఖుల కచేరీలో ప్రశంసలందుకున్నారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హయాంలో రాష్ట్రపతి భవన్‌లో తన కళా ప్రదర్శనతో మెప్పు పొందారు. కళ్లను అయన కుటుంబ సభ్యులు కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకి దానం చేశారు. సంగీతంలో ఎంతోమంది మృదంగ కళాకారులను తయారు చేసిన నాగేశ్వరరావు మృతి కళా ప్రపంచానికి తీరని లోటు అని సర్పంచ్ సాకా శ్రీనివాస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కాలువలో మునిగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండల పరిధిలోని వెలిచేరు గ్రామానికి చెందిన మంతెన సుబ్రహ్మణ్యరాజు (67) కాలువకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. మృతదేహం శుక్రవారం వెలిచేరు సమీపంలో లభ్యమైనట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలోచింపజేసిన జారుడుమెట్లు



నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో రామాలయం నిర్మించి వందేళ్లు కావడంతోపాటు శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కళాపరిషత్ అధ్యక్షుడు, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) ఆధ్వర్యంలో పెద్దనాపల్లిలో వచ్చేనెల 3 వరకు పోటీలు జరగనున్నాయి. పోటీలకు మాజీ ఎంపీ ఎంఎం పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి వెలిగించారు. తొలిరోజు హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారు ప్రదర్శించిన జారుడుమెట్లు నాటిక ఆలోచింపజేసింది. దేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది ప్రాణత్యాగం చేయగా నేటి సమాజంలో స్వార్థంతో జీవిస్తున్నారు. బ్రిటీషు వారు వదిలివెళ్లిన సంస్కృతిని ఇప్పటివరకు మనవారు పాటిస్తున్నారు. దీనిని రూపుమాపేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాలనే నినాదంతో నాటిక కొనసాగింది. కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించగా కంచర్ల సూర్యప్రకాశరావు రచన అందించారు.

విద్యుదాఘాతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మణికంఠ మృతదేహం

కరప: కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటికి వాటరింగ్ చేసే క్రమంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. కరప శివారు పేపకాయలపాలెం గ్రామానికి చెందిన పేపకాయల వెంకటరమణ, సాయిగంగాదేవి దంపతులకు ముగ్గురు కుమారులు, వీరిలో మణికంఠ (20) హైదరాబాద్‌లోని టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. మిగిలిన ఇద్దరూ ఉద్యోగస్తులే. మణికంఠ సెలవులకు పేపకాయలపాలెంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. శుక్రవారం కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటిగోడలు తడిపేందుకు యత్నించగా మోటార్ పంపు పనిచేయలేదు. మోటార్ స్విచ్ ఆన్‌చేసిన విషయం మర్చిపోయి, మోటార్ పంపును రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతంతో మణికంఠ కిందపడిపోయాడు. 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేపకాయలపాలెంలో విషాదఛాయలు

మణికంఠ మృతితో పేపకాయలపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుగా ఉండేవాడని, గ్రామంలోకి ఎప్పుడు వచ్చినా చిరునవ్వుతో పలకరించేవాడని స్నేహితులు కంటతడి పెట్టుకున్నారు. ముగ్గురు పిల్లలూ ఉద్యోగాలు చేసుకుంటున్నారని ఆనందపడుతుంటే ఒకడు ఇలా అర్ధంతరంగా పోతాడనుకోలేదని, సాయంత్రం రైలెక్కి హైదరాబాద్ వెళ్లాల్సిన కొడుకు ఆసుపత్రి నుంచి శవమై వస్తాడని అనుకోలేదని తల్లిదండ్రులు వెంకటరమణ, సాయిగంగాదేవి విలపించారు.

అస్వస్థతతో ఉన్న పీవో ఇంట్లో సీబీఐ విచారణ

- పోస్టల్ నిధుల గోల్‌మాల్‌పై ఆన్‌లైన్ రికార్డుల పరిశీలన



సీబీఐ విచారణ జరుగుతున్న అమలాపురం హెడ్ పోస్టాఫీస్

అమలాపురం టౌన్: విలస పోస్టాఫీస్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా జరిగిన రూ.1.18 కోట్ల గోల్‌మాల్‌పై విశాఖపట్నం సీబీఐ అధికారుల బృందం విచారణ నాలుగో రోజు శుక్రవారం కూడా జరిగింది. సీబీఐ అధికారులు అమలాపురంలోనే మకాం వేసి ఈ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధ్యులను విచారిస్తున్నారు. ఐపీపీబీకి ఆన్‌లైన్ ద్వారా జరిగిన లావాదేవీలు తెలుసుకొనేందుకు అమలాపురం హెడ్ పోస్టాఫీస్ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని కంప్యూటర్లను తనిఖీ చేశారు. నిధుల గోల్‌మాల్‌కు కొద్ది రోజుల ముందు విలస పోస్టాఫీసు అధికారి (పీవో)గా పనిచేస్తున్న ప్రసన్నకుమారి అనారోగ్యం కారణంగా అప్పట్లో సెలువు పెట్టారు. సరిగ్గా అదే సమయంలో ఇన్‌చార్జి అధికారులుగా వెళ్లిన ఇద్దరు మహిళా అధికారులు ఈ గోల్‌మాల్‌లో శాఖాపరమైన ప్రాథమిక విచారణలో సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. గత ఏడాది నుంచి అస్వస్థతతో అమలాపురం సూర్యనగర్‌లో తన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న నాటి విలస పోస్టాఫీస్ అధికారి ప్రసన్నకుమారి ఇంటికి సీబీఐ అధికారులు శుక్రవారం వెళ్లి విచారించారు. ఈ కేసులో ఆమె ప్రమేయం లేకపోయినప్పటికీ అనారోగ్యంతో సెలవు పెట్టిన నాటికి ఐపీపీబీ లావాదేవీలు, తర్వాత ఇతరుల ప్రమేయంతో జరిగిన అవకతవకలపై ఆమెను ఆరా తీశారు. అప్పుడు అసలు ఏమి జరిగింది... ఎలాంటి కారణాలు నిధుల దుర్వినియోగానికి దారి తీశాయి వంటి అంశాలపై ఆమెను పలు ప్రశ్నలు వేశారు. నిధుల గోల్‌మాల్ సూత్రధారి సతీష్‌ను కూడా శుక్రవారం సీబీఐ అధికారులు లోతుగా విచారించారు. ఈ నిధుల దుర్వినియోగం అభియోగాలతో షోకాజ్ నోటీసులు అందుకున్న ఎనిమిది మంది పోస్టల్ ఉద్యోగులను కూడా సీబీఐ విచారించనుంది.